# దళిత వ్యతిరేకి రఘునందన్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న రాజలింగం

సిద్దిపేట టౌన్, అక్టోబర్ 14: దళితుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన దళితబంధు అమలుకు దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అడ్డుపడడం, ఆవివేకానికి నిదర్శనమని డీడబ్ల్యూజేఎస్ జిల్లా అధ్యక్షుడు జంగం రాజలింగం అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టుగా, న్యాయవాదిగా, ప్రజాప్రతినిధిగా అనుభవం కలిగిన రఘునందన్‌రావుకు దళితులు ఎదగడం ఇష్టం లేదని, అందుకు ఎన్నికల కమిషన్‌కు చేసిన ఫిర్యాదే నిదర్శనమన్నారు. దుబ్బాక నియోజకవర్గంలోని దళిత జర్నలిస్టులకు ఎలాంటి సహాయం చేయకపోయినా, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతుంటే అడ్డుపడడం నీచమైన చర్యగా అభివర్ణించారు. రఘునందన్‌రావు దుబ్బాక నియోజకవర్గంలోని దళితులందరూ కలిసి బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. దళితబంధు పథకం ఎన్నికల ముందు నుంచే అమలు అవుతుందని, బంధు రాకుండా రఘునందన్‌రావు తన స్వార్థ ప్రయోజనం కోసం దళిత జర్నలిస్టులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో దళిత జర్నలిస్టు నాయకులు జనార్దన్ బాబురావు,రంగ రాజు,రాజు,నర్సయ్య,చంద్రం ఉన్నారు.

# విజయవంతంగా మోకాలి మార్పిడి ఆపరేషన్లు


మోకాలి చిప్ప ఆపరేషన్ చేస్తున్న వైద్యులు

సిద్దిపేట, అక్టోబర్ 14 : సిద్దిపేట ప్రభుత్వ జనరల్ దవాఖానలో మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలను వైద్య సిబ్బంది విజయవంతంగా నిర్వహించారు. ఇప్పటి వరకు 100 మందికి మోకాలి మార్పిడి ఆపరేషన్లు చేసినట్లు దవాఖాన సూపరింటెండెంట్ కిశోర్ కుమార్ తెలిపారు. శుక్రవారం వృద్ధుడికి నిర్వహించిన శస్త్ర చికిత్సతో 100 ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కట్కూరి రఘుపతిరెడ్డి (70) మోకాలు నొప్పితో ఐదేండ్లుగా బాధపడుతున్నాడు. వృద్ధుడు సిద్దిపేట ప్రభుత్వ దవాఖాన వైద్యులను సంప్రదించగా, ఆర్థోపెడిక్ విభాగ వైద్యులు పరీక్షలు నిర్వహించి సమస్యను గుర్తించారు. వృద్ధుడికి సిద్దిపేట ప్రభుత్వ దవాఖానలో ఉస్మానియా దవాఖాన ఆర్థోపెటిక్ విభాగ సర్జన్ ఆధ్వర్యంలో మోకాలి మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించారు.

# పొదుపు పథకాలపై స్పెషల్ డ్రైవ్


మాట్లాడుతున్న తపాల శాఖ సంగారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ సంపత్‌రెడ్డి

గుమ్మడిదల, అక్టోబర్ 14: మండల కేంద్రం గుమ్మడిదలలో పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో శనివారం పొదుపు పథకాలపై పోస్టల్ శాఖ సంగారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈనెల 16 నుంచి 21 వరకు నేషనల్ పోస్టల్ వీక్ ముగింపు ఉత్సవాల్లో భాగంగా మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ సంపత్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయ తపాల వారోత్సవాల్లో భాగంగా ఈనెల 9 నుంచి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు అకౌంట్ ఓపెనింగ్, గ్రూప్ యాక్సిడెంట్ గార్డ్ పాలసీల ప్రత్యేక మేళాలు నిర్వహించినట్లు చెప్పారు. అకౌంట్స్ ఓపెనింగ్, పాలసీల సేకరణ చేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో ఇంటింటికి పోస్టల్ పథకాలు తీసుకెళ్లాలనే స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు చెప్పారు. పుట్టిన పసికందు నుంచి వంద ఏండ్ల వయసు గల వారందరికీ వివిధ పోస్టల్ పథకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గుమ్మడిదల, కానుకుంట, అన్నారం, నల్లవలి, బొంతపల్లి, బ్యాంచి పోస్ట్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు


కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

# ఉల్లాసంగా.. ఉత్సాహంగా

- గురుకులంలో రెండో రోజు జోనల్ స్థాయి క్రీడలు
- అథ్లెటిక్స్‌లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేత

జిన్నారం, అక్టోబర్ 14: జిన్నారం గిరిజన గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న 7వ జోనల్ స్థాయి క్రీడలు ఉల్లాసంగా.. ఉత్సాహంగా జరుగుతున్నాయి. క్రీడల్లో శనివారం అథ్లెటిక్స్ నిర్వహించారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారు. రన్నింగ్, లాంగ్ జంప్, షాట్‌పుట్‌లో గెలుపొందిన వారికి ప్రిన్సిపాల్ మధుసూదన్ రెడ్డి బహుమతులు అందజేశారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నిస్ కాయిట్ క్రీడల్లో సెమిఫైనల్స్ జరిగాయి. ఫైనల్స్ ఆదివారం నిర్వహించి గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. చివరి రోజు కార్యక్రమానికి గురుకులాల కార్యదర్శి నవీన్ నికోలస్ హాజరుకానున్నారని ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు సాంబ్యానాయక్, గాయత్రీ, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, పీడీ పీఈటీలు పాల్గొన్నారు.

**అథ్లెటిక్స్‌లో గెలుపొందిన విద్యార్థులు**

అండర్ 19లో 3000 మీటర్ల పరుగు పందెంలో పీ.బాలాజి (కంగ్టి), కే.నవీన్(కొడంగల్), ఎం.సుభాష్(కొడంగల్), అండర్ 17 విభాగంలో ఎన్.మహేందర్(మన్ననూర్), జే.రోహిత్ (నారాయణఖేడ్), బీ.చరణ్ (మన్ననూర్), జే.అరుణ్(కొండాపూర్), అండర్ 19 800 మీటర్లలో భాస్కర్ (పెద్దమందాడి), రాహుల్(జిన్నారం), ప్రకాశ్(కంగ్టి), అండర్ 17 విభాగంలో అర్జున్ (నారాయణఖేడ్), దినేశ్‌కుమార్ (కంగ్టి), రామ్‌చరణ్ (ఇబ్రహీంపట్నం), అండర్14లో 600 మీటర్లలో వికాస్ (జిన్నారం), కుమార్ (ఇబ్రహీంపట్నం), సురేశ్ (కొడంగల్), అండర్17లో 400 మీటర్లలో జానకిరామ్(కుల్కచర్ల), భాస్కర్(పెద్దమందాడి), శివాజీ(కొడంగల్), అండర్ 17 నాలుగు వందల మీటర్లలో మహేందర్(మన్ననూర్), హనుమంత్(మన్ననూర్), విక్రమ్(నారాయణఖేడ్), అండర్ 14 మీటర్లలో రాజేశ్ (ఇబ్రహీంపట్నం), తరుణ్(కొండాపూర్), పవన్(ఇబ్రహీంపట్నం), అండర్ 14 షాట్‌పుట్‌లో సింహాద్రి(కొత్తూరు), శివకుమార్(మన్ననూర్), ఠాగూర్(పెద్దమందాడి), అండర్17లో పరశురామ్(మన్ననూర్), భాస్కర్(పెద్దమందాడి), సాయికుమార్(మన్ననూర్), అండర్19లో పవన్(జిన్నారం), వినయ్‌కుమార్ (హయత్‌నగర్), శ్రీరామ్(మన్ననూర్), అండర్ 14 లాంగ్‌జంప్‌లో హీరాలాల్ (నారాయణఖేడ్), మహేశ్(పెద్దమందాడి), వినోద్(నారాయణఖేడ్), అండర్17లో గణేశ్(ఇబ్రహీంపట్నం), రామ్‌చరణ్(కొడంగల్), హీరాలాల్(నారాయణఖేడ్) అండర్ 19లో జానకీరామ్(కుల్కచర్ల), తరుణ్(కుల్కచర్ల), సిద్ధార్థ్(కొండాపూర్) గెలుపొందిన వారు బహుమతులు అందుకున్నారు.

# చెరువులో పడి ముగ్గురు పారిశుధ్య కార్మికులు మృతి

## మృతుల్లో ఇద్దరు మహిళలు, ఒక యువకుడు


జగదేవ్‌పూర్, అక్టోబర్ 14: తీగుల్ గ్రామంలోని చెరువు వద్దనున్న బతుకమ్మ ఘాట్ దగ్గర శుభ్రం చేస్తుండగా ముగ్గురు పారిశుధ్య కార్మికులు జారి చెరువులో పడి మృతిచెందిన ఘటన జగదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. ఎస్సై చంద్రమోహన్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తీగుల్ గ్రామంలో బతుకమ్మ పండుగ సందర్భంగా ఆరుగురు పారిశుధ్య కార్మికులు గ్రామంలోని అన్ని వీధులు, ప్రధాన కూడళ్లు శుభ్రం చేస్తున్నారు. ఈ క్రమంలో పఠాన్ చెరువు వద్దనున్న బతుకమ్మ ఘాట్ వద్ద మెట్లను శుభ్రం చేస్తున్నారు. చెరువులో నాచు, చెట్ల పొదలు తీసే క్రమంలో ముగ్గురు కార్మికులు ప్రమాదవశాత్తు ఒకరి వెంట ఒకరు ముగ్గురు చెరువులో కాలు జారి పడ్డారు. అక్కడే పొదలు శుభ్రం చేస్తున్న మరో ముగ్గురు కార్మికులు ఇది గమనించి, వారిని రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ కరెమ్మల బాబు (25), గిరిపల్లి భారతి (40), ఎల్లం యాదమ్మ(43) అప్పటికే చెరువులో మునిగిపోయారు. మిగతా కార్మికులు సర్పంచ్ భానుప్రకాశ్‌కు సమాచారం చేరవేశారు. ఆయన హుటాహుటినా ఘటనా స్థలానికి వచ్చి, స్థానికులతో కలిసి చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు, గజ ఈతగాళ్ల సహాయంతో చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. దీంతో ముగ్గురు కార్మికుల మృతదేహాలను వెలికితీశారు. ఈ చర్యల్లో మర్కూక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్సై శంకర్, పోలీసులు సాయమందించారు. చెరువు వద్ద బాధిత కుటుంబాల రోదనలు మిన్నంటాయి. బాబుకు భార్య ఇద్దరు కొడుకులు ఉన్నారు. గిరిపల్లి భారతి భర్త మల్లయ్య కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. ఆమెకు కూతురు, కొడుకు ఉన్నారు. ఎల్లంయాదమ్మకు భర్త భూమయ్య, కొడుకు, కూతురు ఉన్నారు.

**పారిశుధ్య కార్మికుల కుటుంబాలను ఆదుకుంటాం**

చెరువులో పడి మృతి చెందిన పారిశుధ్య కార్మికుల మృతదేహాలను ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి పరిశీలించారు. బాధిత కుటుంబాలను ఓదార్చారు. పండుగ రోజు మూడు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం తరపున ఆదుకుంటామని భరోసా కల్పించారు.

# రియాక్టర్లు పేలి 9 మందికి తీవ్ర గాయాలు

- ఇద్దరి పరిస్థితి విషమం
- కార్మికులను పరామర్శించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
- ఘటనా స్థలాన్ని సందర్శించిన ఎస్పీ, డీఎస్పీ


కార్మికులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

బొల్లారం, అక్టోబర్ 14: రసాయన పరిశ్రమలో రెండు రియాక్టర్లు పేలిన ఘటనలో 9 మంది కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఐడీఏ బొల్లారం పారిశ్రామికవాడలోని అమర ల్యాబ్ పరిశ్రమలో శుక్రవారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం జరిగింది. రాత్రి 9.30 గంటలకు మొదటి రియాక్టర్, 10 గంటలకు రెండో రియాక్టర్ పేలింది. దీంతో భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. పలువురు కార్మికులు ఉరుకులు, పరుగులు తీయగా, పలువురు మంటల్లో చిక్కుకున్నారు. ఈ ప్రమాదంలో తొమ్మిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పేశారు. క్షతగాత్రులను హుటాహుటిన సమీపంలోని దవాఖానకు తరలించి చికిత్స అందించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నదని వైద్యులు తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో పరిశ్రమలో 15 మంది కార్మికులు ఉన్నారు.

**ఇద్దరి పరిస్థితి విషమం**

మంటల్లో 9 మంది కార్మికులకు తీవ్రంగా కాలిన గాయాలయ్యాయి. గాయపడ్డ వారిలో మహేందర్, సంతోష్‌కుమార్, రాకేశ్‌కుమార్, అమరేందర్‌రెడ్డి, రంగారావు ఉన్నారు. వీరిలో రంగారావు, రాకేశ్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉన్నది. సూర్యారావు, వినోద్, అజయ్‌కుమార్, స్వామి, రాజ్‌కుమార్, ధన్నుకుమార్ స్వల్పంగా గాయపడ్డారు. పరిశ్రమలో రియాక్టర్లు పేలడంతో పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. పోలీసులు, యాజమాన్యం వెంటనే అగ్నిమాపక దళాలకు సమాచారం అందించడంతో మాదాపూర్, కేపీహెచ్‌బీ, పటాన్‌చెరు, జీడిమెట్ల నుంచి 8 ఫైర్ ఇంజిన్లు వచ్చి మంటలు అదుపులోకి వచ్చాయి.

**బాధితులకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పరామర్శ**

బొల్లారం పారిశ్రామికవాడలోని అమర ల్యాబ్ పరిశ్రమలో రియాక్టర్లు పేలిన ఘటనలో గాయపడి, దవాఖానలో చికిత్స పొందుతున్న కార్మికులను ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పరామర్శించారు. కార్మికుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సాయం కోసం నగరంలోని డీఆర్డీఏ దవాఖానకు తరలించాలని సూచించారు. ఈ ఘటనపై మంత్రి హరీశ్‌రావుకు ఫోన్లో వివరించారు. ప్రభుత్వం తరపున బాధిత కార్మికులకు అండగా ఉంటామన్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ జడ్పీటీసీ కొలన్ బాల్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ హన్మంత్‌రెడ్డి, నాయకులు వరప్రసాద్‌రెడ్డి ఉన్నారు.

**ప్రమాద స్థలాన్ని సందర్శించిన ఎస్పీ**

ఈ ఘటనపై సమాచారం తెలుసుకున్న సంగారెడ్డి ఎస్పీ సీహెచ్ రూపేశ్, డీఎస్పీ పురుషోత్తంరెడ్డితో కలిసి అమర ల్యాబ్ పరిశ్రమను సందర్శించారు. ఘటనకు కారణమైన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలని పోలీసులను ఆదేశించారు. బొల్లారం సీఐ నయీముద్దీన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.